
సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



బోరుమంటున్నారు..!

- సింగూరు ప్రాజెక్టులో వేగంగా పడిపోతున్న నీటిమట్టం
- సుమారు 30 శాతం మేరకు ఎండిపోయిన పంటలు
- సంక్షోభం దిశగా యాసంగి సాగు
- మారుమూల గ్రామాల్లో తాగునీటి కటకట
- మెతుకు సీమలో కోరలు చాస్తున్న కరువు



ఎల్లరేగడిలో నీటి కోసం తండ్లాట

బోర్లే కాదు.. బావుల్లోనూ మట్టి తేలుతోంది

ఊరంతటికీ ఉన్న ఒకేఒక నల్లావద్ద నీటి కోసం బిందెలతో గుమిగూడిన ఈ చిత్రం తెలంగాణ – కర్నాటక సరిహద్దు ప్రాంతమైన నారాయణఖేడ్ నియోజకవర్గం ఎల్లరేగడి తండాలోనిది. సుమారు 45 కుటుంబాలకు బోర్లు ఎండిపోవడంతో ఈ ఒక్క నల్లా వద్దే గ్రామస్తులంతా నీళ్లు పట్టుకుంటున్నారు. బిందెలతో నీటిని మోసుకుంటున్నారు.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మెతుకు సీమగా పేరున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో కరువు రోజురోజుకు కోరలు చాస్తోంది. ఎండల తీవ్రతకు భూగర్భ జలాలు అడుగంటి పోయి.. బోరు భావులు వట్టిపోతున్నాయి. 365 రోజులు నీరుండే వ్యవసాయ భావుల్లో కూడా మట్టి తేలుపోతున్నాయి. ఈ బావుల ఆధారంగా సాగు చేసుకుంటున్న రైతులు పంటలను కాపాడుకునేందుకు అనేక పాట్లు పడుతున్నారు. ఉన్న బోర్ల నుంచి మరింత లోతుకు తవ్వడం.. కొత్త బోర్లు వేసుకొవడం.. వ్యవసాయ భావుల్లో పూడిక తీత చేసుకుంటున్నారు. దీంతో ఆయా రైతులపై రూ.లక్షల్లో పెట్టుబడి బారం పెరిగిపోతోంది. ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగిలో మొత్తం 8.49 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా.. ఇందులో సుమారు 30 శాతం పంటలు కరువు కారణంగా ఎండిపోయినట్లు అనధికారిక అంచనా.

తాగునీటికీ కటకటే..

తాగునీటి ఎద్దడి తీవ్ర మవుతోంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా తాగునీటి సమస్య ఎదురవుతోంది. ప్రధానంగా మారుమూల గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అనేక అవస్తలు పడుతున్నారు. మిషన్‌భగీరత ద్వారా పూర్తి స్థాయిలో నల్లా నీళ్లు రాకపోవడంతో గ్రామాల్లో ఉన్న ఒకటీ రెండు నల్లాల వద్ద తాగునీటి కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏప్రిల్ మొదటి వారం లోనే ఈ పరిస్థితి ఉంటే మే మాసంలో తాగునీటి కష్టాలు ఏ స్థాయిలో ఉంటాయోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

సింగూరు ప్రాజెక్టు



పూర్తిగా నెర్రెలు బారిపోయి.. ఎడారిని తలపిస్తున్న ఈ చిత్రం సింగూరు జలాశయం ఎగువభాగం సంగారెడ్డి జిల్లా రాయ్‌కోడ్ మండలంలోనిది. హైదరాబాద్‌కు తాగునీరు, ఉమ్మడి మెదక్ జిల్లాకు సాగునీరు అందించే ఈ సింగూరు (మంజీరా) ప్రాజెక్టు నీటి మట్టం ఎండల తీవ్రతకు వేగంగా పడిపోతోంది. గత ఏడాది ఇదే రోజు ప్రాజెక్టులో 20 టీఎంసీలు ఉండగా, ఇప్పుడు ప్రస్తుతం 17.94 టీఎంసీలున్నాయి. గత పోల్చితే సుమారు రెండు టీఎంసీల నీళ్లు తక్కువగా ఉన్నాయి.

మిరిదొడ్డిలో



అడుగంటి పోయి మట్టి తేలిన వ్యవసాయ భావిలో పూడిక తీత కోసం క్రేన్‌ను ఏర్పాటు చేసుకున్న ఈ రైతు పేరు నక్కరాజం. సిద్దిపేట జిల్లా మిరిదొడ్డి మండల కేంద్రం. ఈనకున్న రెండు ఎకరాల్లో వరి సాగుకు ఈ వ్యవసాయ భావే దిక్కు. బావిలో నీరు ఎండిపోవడంతో అర ఎకరం పంట ఎండిపోయింది. మిగితా పంటను కాపాడుకునేందుకు క్రేన్ సహాయంతో పూడిక తీత పనులకు ఏర్పాట్లు చేసుకోగా ఎండల తీవ్రత కారణంగా కూలీలు కూడా ముందుకు రావడం లేదు. దీంతో రాజం ఎటూ పాలుపోని పరిస్థితిలో పడిపోయాడు.

రంగంపేట్ గ్రామంలో



బోరుబావి తవ్వించగా వచ్చిన తెల్లమట్టి దిబ్బ వద్ద ఉన్న ఈ రైతు పేరు ముల్లెల గణేష్‌ది మెదక్ జిల్లా కొల్చారం మండలం రంగంపేట్ గ్రామం. తన ఆరు ఎకరాల భూమిలో వరి సాగు చేస్తున్న గణేష్ రెండు బోర్లు ఉండేవి. రెండు బోర్లు కూడా ఫెయిల్ అయిపోయాయి. మూడు ఎకరాలు ఎండిపోయింది. దీంతో ఆరు వందల ఫీట్ల లోతులో ఒక బోరు, ఐదు వందల ఫీట్లు రెండో బోరు వేయించాడు. ఇందుకోసం ఇప్పటి వరకు సుమారు రూ.2.30 లక్షల ఖర్చు చేశాడు. కానీ ఒక్క బోరు నుంచే సన్నటి దార మాత్రమే వస్తుందని, ఈ దారతో ఆరు ఎకరాలు ఎలా పారించుకోవాలని వాపోతున్నాడు.



నారాయణఖేడ్ హోటల్‌లో టీ సేవిస్తున్న జనాలు

వెరై టీ

సండే స్పెషల్



- చాయ్ తాగనిదే మొదలు కాని రోజు
- టీ సేవిస్తే చికాకులు దూరం
- పట్టణాల్లో జోరుగా వ్యాపారం
- స్టాల్స్ ఏర్పాటుకు విద్యావంతుల ఆసక్తి
- మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.100 వరకు టీ లభ్యం

చాయ్ చటక్కునా తాగరా భాయ్..
చాయ్ చమక్కులే చూడరా భాయ్..
చాయ్ ఖరీదులో చీప్ రా భాయ్..
చాయ్ ఖుషీలనే చూపురా భాయ్..

అని ఓ సినీ కవి చాయ్ గురించి వర్ణించాదంటే ఇది మనిషి జీవితంలో ఎంతటి ప్రాముఖ్యత సందరించుకుందో అర్థం చేసుకోవచ్చు. ప్రతీఒక్కరు ఉదయాన్నే టీ తాగడంతో రోజును ప్రారంభించడం పరిపాటిగా మారింది. ప్రపంచవ్యాప్తంగా మంచినీటి తర్వాత ఎక్కువ మంది తాగుతున్నది టీనే. టీ లవర్స్ ఎక్కువ కావడంతో ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. దీని ద్వారా వ్యాపారులు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు.

– నారాయణఖేడ్ (వెంకటేశ్)

పట్టణాల్లో టీ హోటళ్లు భారీ ఎత్తున ఏర్పాటవుతున్నాయి. పైకి చూస్తే సాధారణ టీ స్టాలే కానీ అందులో జరిగే వ్యాపారం మాత్రం వేలల్లో ఉంటుంది. ఉన్నత చదువులు చదివిన వారు సైతం టీ స్టాళ్లను ఏర్పాటు చేసుకుని తాము ఉపాధి పొందుతూ నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లాలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ లాంటి నియోజకవర్గ కేంద్రాలతోపాటు పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాల్లో భారీగా టీ కొట్లు ఏర్పాటయ్యాయి. సుమారు 800పైగా ప్రధాన టీకొట్లు ఉంటాయి. ఇందులో నిత్యం ఒక టీకొట్టులో రూ.10వేల వరకు వ్యాపారం సాగగా సరాసరి జిల్లాలో రోజుకు రూ.50 లక్షల నుంచి 60లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. ఒక్కో హోటల్‌లో ముగ్గురు మొదలుకొని 10మంది ఆపైగా పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఉన్నత చదువులు చదివిన వారు సైతం టీవ్యాపారం దిశగా అడుగులు వేస్తున్నారు. నిర్వాహకులు నెలకు ఖర్చులు పోను రూ.25వేల నుంచి 50వేల వరకు ఆదాయం పొందుతున్న వారూ ఉన్నారు. రూ.10 నుంచి రూ.100 విలువగల టీలు ఉన్నాయి.

మరికొన్ని టీ రకాలు..

అల్లం, గ్రీ, సొంటి, బ్లాక్, ఊలాంగ్, నిమ్మకాయ, వైట్, మందార, బెల్లం, రోస్ట్, స్ట్రాబెర్రీ, పాన్, మసాలా, కేరళ బట్టర్, కాశ్మీర్ డ్రైఫ్రూట్ టీ, కేరళ బట్టర్ టీ, రాజస్థాన్ రాజ్‌వాడీ టీ, పెప్పర్ మిల్క్, తందూరీ ఇలా అనేక రకాలు చాయ్‌లు దుకాణాల్లో అందుబాటులో ఉంటున్నాయి.

నిత్యం టీ తాగుతా..



రోజూ టీ తాగుతాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐదారుపైగా టీలు అవుతాయి. మిత్రులు కలిసినా టీ సాధారణమే. టీ తాగిదే దాని అనుభూతే వేరుగా ఉంటుంది.

– మొహ్మద్ సలీం, వ్యాపారి, నారాయణఖేడ్

టీకి రూ.100 నుంచి రూ.300 ఖర్చు..



మిత్రులతో కలిసి నిత్యం రకరకాల టీలు సేవిస్తుంటాను. టీకి ఖర్చు రూ.100 నుంచి రూ.300 వరకు అవుతుంది. ఆయా రకాల టీలను సేవించేందుకు ఇష్టపడతాను. టీ సేవనానికి అడక్ట్ అయ్యాను.

– సీహెచ్. అంజయ్య, ధన్వార్

ఫార్మాఫీల్డ్ వదిలి టీ వ్యాపారం వైపు..



డిగ్రీ విద్యాభ్యాసం పూర్తయ్యింది. హైదరాబాద్‌లో ఫార్మాఫీల్డ్‌లో ఉద్యోగం చేసేవాడిని. ఆ వ్యాపారం వదిలి నారాయణఖేడ్‌లో టీ వ్యాపారం పెట్టాను. నాతోపాటు ఐదుగురికి వర్కర్లకు ఉపాధి కల్పిస్తున్నాను. నిత్యం రూ.15వేల వ్యాపారం అవుతుంది. ఖర్చులుపోను రూ.5వేల ఆదాయం ఉంటుంది.

– రవీందర్‌రెడ్డి, టీ వ్యాపారి, నారాయణఖేడ్

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న హన్మంతరావు

సంగారెడ్డి: పేదలకు మెరుగైన వైద్యం అందించాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వెల్నెస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నెలరోజుల ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వెల్నెస్ ఆస్పత్రి ఎండి డాక్టర్ లాలేష్ మాట్లాడుతూ.. వెల్నెస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నెలరోజుల పాటు 60 ఏళ్లు దాటిన వారికి ఓపీ ఫ్రీగా ఇస్తూ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ రాజేందర్, డాక్టర్ రాజకుమార్, హెచ్ఆర్ డేవిడ్ పాల్గొన్నారు.

చట్టాలను తుంగలో తొక్కిన కేంద్రం

పటాన్‌చెరు టౌన్: కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం పిలుపునిచ్చారు. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదేవే 34వ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడానికి రణదేవే కృషి చేశారన్నారు. కార్మిక చట్టాలను తొలగించి నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక చట్టాలకు తూట్లు పొడిచిన మోడీ ప్రభుత్వ విధానాలను ఓడించాలన్నారు. పరిశ్రమల్లో అనేక ప్రమాదాల్లో కార్మికులు మృత్యువాత పడుతున్నా పాలకులకు పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజయ్య, పాండురంగా రెడ్డి, నాగేశ్వరరావు, నాయకులు సంతోష్, కుమార్, రాంరెడ్డి, రోషన్, మూర్తి పాల్గొన్నారు.

గుడిసెలు కూల్చడం దారుణం

సంగారెడ్డి టౌన్ : పట్టణంలోని ఎర్రకుంటలో నిరుపేదలు గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ అధికారులు అక్రమంగా కూల్చేయడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. శనివారం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గుడిసెలు కూల్చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, నాయకులు యాదగిరి, దత్తు, సాయిలు, మనీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కన్నీళ్లే మిగిలాయి

ఎమ్మెల్యే హరీశ్ రావు



రైతు దీక్షలో మాట్లాడుతున్న హరీశ్ రావు

సంగారెడ్డి: కాంగ్రెస్ ప్రభుత్వానికి కోపం ఉంటే తన మీద చూపాలని.. రైతుల మీద కాదని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు, నీళ్లు లేక రైతులకు కన్నీళ్లే మిగిలాయని ఆరోపించారు. 100 రోజుల్లోనే 200 మంది రైతులు చనిపోయారని, వారి కుటుంబాలను ఏ మంత్రి పరామర్శించలేదని మండిపడ్డారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 25 వేల పరిహారం చెల్లించాలని, చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామన్న బీజేపీ కూడా మాట తప్పిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే అన్నారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొట్టమన్న కోమటిరెడ్డికి రైతులే బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ, బుచ్చిరెడ్డి, పట్నం మాణిక్యం, గాలి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో అనిల్ గెలుపు ఖాయం

జహీరాబాద్: గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీ బలం పూర్తిగా పడిపోయిందని, ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు అని హరీశ్ అన్నారు. శనివారం జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అరచేతిలో వైకుంఠం చూపారని విమర్శించారు. ఎన్నో హామీలిచ్చారని, వాటిని పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ మోసాలను ప్రజలు, రైతులకు వివరించి చైతన్య పర్చాలన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను భారీ గెలిపించాలని కోరారు. రెండు పర్యాయాలు బీబీ పాటిల్‌కు జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపిస్తే పార్టీకి మోసం చేశారని హరీశ్‌రావు విమర్శించారు. పాలు తాగిన రొమ్మునే తన్ని వెళ్లిన చందంగా ఆయన వ్యవహారం ఉందన్నారు. ఈ సందర్భంగా రేవంత్, ప్రియాంకగాంధీలు ఇచ్చిన హామీల వీడియోను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఆయా కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు వై.నరోత్తం, ఎం.డి.తనీ్వర్, దేవిప్రసాద్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు రూ.2.50 కోట్లు

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకుగాను ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్)లో రూ.2.50 కోట్లను కేటాయించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం పేరిట అప్పటికే ఉన్న ప్రత్యామ్నాయ నీటి వనరులను నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ ఏడాది తక్కువ వర్షపాతంతోపాటు ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయన్నారు. గ్రామాల్లో ప్రత్యామ్నాయంగా నీటి వనరులకు అవసరమైన మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమస్య లేకున్నా నీటి ఎద్దడి తీవ్రంగా ఉందంటూ చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, నాయకులు సంగన్న పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి: ప్రభుత్వ మెడికల్ కాలేజ్/ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో కాంట్రాక్టు ప్రతిపాదన అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అధికారులు శనివారం తెలిపారు. ఈనెల 10న సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

మెదక్‌లో బీజేపీ జెండా ఎగరేస్తాం

బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్



కిరాణా షాప్ లో ప్రచారం చేస్తున్న రఘునందన్ రావు

సంగారెడ్డి: మెదక్ ఎంపీ స్థానంపై బీజేపీ జెండా ఎగరేస్తామని పార్టీ లోక్‌సభ అభ్యర్థి రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలో పలు వార్డుల్లో కరపత్రాలను పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడోసారి నరేంద్ర మోదీకి పట్టాభిషేకం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. దేశంలో 400 ఎంపీ సీట్లు గెలుస్తున్నామని అందులో మెదక్ కూడా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 12 సీట్లులో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు బీజేపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తొలుత పాత బస్టాండ్ దగ్గర గల శ్రీరామ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. భవానీ మందిర్ వద్ద టిఫిన్ బైఠక్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, కొవ్వూరు సంగమేశ్వర్, జిల్లా నాయకులు రాజశేఖర్ రెడ్డి, మాణిక్ రావు, వాసు, హనుమంత్ రెడ్డి, కల్వకుంట్ల యశ్వంత్, పవన్, నర్సారెడ్డి, శ్రీపతిరావు, కౌన్సిలర్లు రమేష్ నాగరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి, రవిశంకర్, రాజు గౌడ్, ప్రవీణ్ యాదవ్, సమరసింహారెడ్డి, డాక్టర్ అరుణ, ఈశ్వరి, తేజస్వి, తిరుమలేష్, రవీందర్ రెడ్డి రాజేందర్ రెడ్డి మల్లేశం యాదవ్, రాములు, సూర్య తేజ, సందీప్, వినోద్, సాయి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్లు స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..



విద్యుత్ సరాఫరాను తొలగించిన అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నీటి వ్యాపారంపై సాక్షి దినపత్రికలో శనివారం 'జోరుగా నీటి దందా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రామచంద్రాపురం తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి, మున్సిపల్ అధికారులు తెల్లాపూర్‌లో నీటి వ్యాపారం నిర్వహిస్తున్న వ్యవసాయ భూమి వద్దకు చేరుకొని మోటార్‌లకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి మాట్లాడుతూ నీటి వ్యాపారంపై కఠినంగా వ్యవరిస్తామని తెలిపారు. తెల్లాపూర్‌లో రెండు ట్యాంకర్‌లను, మూడు జనరేటర్‌లు, నాలుగు నీటి మోటార్‌లకు సంబంధించిన కేబుళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఇద్దరు సిబ్బందిని నియమించామని, వారు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. ఎవరైన నీటి వ్యాపారం నిర్వహిస్తే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

తాగునీటి ఇబ్బందులు రావద్దు

డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజీ భారతి హోలీ కేరి



మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజీ భారతి హోలి కెరీ

సంగారెడ్డి టౌన్: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ ఆర్కియాలజీ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోలీ కేరి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరి క్రాంతితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీరోజు మిషన్ భగీరథ ద్వారా అన్ని ప్రాంతాలకు తాగు నీటి సరఫరా చేయాలన్నారు. భగీరథ నీరు రాని గ్రామాల్లో పంచాయతీ బోరు మోటర్ల ద్వారా నీటిని అందించాలని తెలిపారు. నీటి సమస్య ఉన్నట్లు తెలిస్తే ప్రత్యేక అధికారులు వెంటనే స్పందించాలన్నారు. తాగునీటి సమస్యపై ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 8 మున్సిపాలిటీలు, 26 మండలాలలో సింగూరు నుంచి మంజీరా జలాలు అందజేస్తున్నట్టు తెలిపారు. అమీన్పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపాలిటీలకు మిషన్ భగీరథ హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా తాగునీటి సరఫరా చేసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

సువిధ పోర్టల్ ద్వారా నామినేషన్

సంగారెడ్డి టౌన్: సువిధ పోర్టల్ ద్వారా అభ్యర్థులు నామినేషన్ వేసుకోవచ్చని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. శనివారం కలెక్టరేట్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సువిధ పోర్టల్ లో httpr://ruvidha.eci.gov.in ద్వారా అభ్యర్థులకు నామినేషన్ వేసుకుని సౌకర్యం ఉంటుందని చెప్పారు. ఈనెల 18వ తేదీ నుండి 25వ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ప్రభుత్వ సెలవు దినాలలో తీసుకోబడుదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా 25వేల రూపాయల సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని.. షెడ్యూలు, కులాల తెగకు చెందిన అభ్యర్థి మొత్తంలో సగం మాత్రమే సెక్యూరిటీ డిపాజిట్ చేయాలన్నారు. అభ్యర్థులు తమపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నవారు, దోషిగా తేలిన కేసుల గురించి విస్తృత ప్రచారం కోసం టీవీ ఛానళ్లు, వార్తా ప్రతికలలో వేయించాలన్నారు. ఎన్నికలు నిర్వహణ సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, వివిధ పార్టీల నాయకులు,ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.